జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 27-06-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 56 పేజీలు: 4 వెల: రూ.7

# ప్రభుత్వ మెడికల్ కళాశాల.. చెత్త చెత్తగా!





* కళాశాల ముందు క్లీన్‌గా.. లోపల అధ్వానంగా
* కంపుకొడుతున్న మురుగుదొడ్లు
* మురుగునీటి నిల్వతో దోమల బెడద
* పారిశుధ్యం అధ్వాన్నం
* స్వచ్ఛత ఊసేలేదు
* ఇబ్బందులు పడుతున్న ప్రొఫెసర్లు, మెడికోలు
* అనారోగ్యం పాలవుతున్న విద్యార్థులు
* ఆందోళన చెందుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు



**శ్రీకాకుళం, జూన్ 26 (వార్త):** రిమ్స్ ఆవరణలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలకు రాష్ట్రంలోనే ఒక మంచి గుర్తింపు ఉంది. ఇక్కడ రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు లక్షలు పోసి మెడిసిన్ చదువుతున్నారు. అత్యుత్తమ బోధన అందించే ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు. కోట్లాది రూపాయలు విలువ చేసే ల్యాబ్, తదితర సౌకర్యం ఉంది. కళాశాల భవనాన్ని బయట నుంచే చూడడానికి చాలా బా..గుంటుంది. లోపలికి వెళితే మాత్రం అసలు బాగోతం బయటపడుతుంది. పారిశుధ్య పనులు అస్సలు మచ్చుకైనా కానరాదు. తరగతి గదులకు వెళ్లే ప్రాంతాల్లో ముక్కుమూసు కోవాల్సిందే. బాత్‌రూమ్‌లు కంపుకొడుతున్నాయి. భవనం గోడలపై మొక్కలు పెరిగిపోయాయి. బాత్‌రూమ్‌లకు చెందిన పైపులైన్లు పాడవడంతో పైఅంత స్థుల నుంచి కిందకు మురుగునీరు పడుతోంది. ఆ నీరంతా బయటకు వెళ్లే అవ కాశం లేకపోవడంతో మురుగు గుంటలా మారింది. దోమలకు నిలయంగా మారింది. దీంతో మెడికోలతో పాటు ప్రొఫెసర్లు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు విద్యార్థులైతే తరచూ ఆనారోగ్యం బారిన పడుతున్నారు. పారిశుధ్య నిర్వహణపై పెద్ద ఎత్తున నిధులు మంజూరవుతోంది. ఆ నిధులు ఏమవు తున్నాయో కళాశాల అధికారులకే తెలియాలి. పై ఫ్లోర్ వరకూ బాగానే ఉన్నప్పటికీ.. కింది ఫ్లోర్‌లో పలుచోట్ల లైట్లు కూడా వెలగడం లేదు. అందరికీ ఆదర్శంగా ఉండాల్సిన వారే.. ఇంతటి నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవు తున్నాయి. పారిశుధ్య పనులు చేయిస్తున్న కాంట్రాక్టర్ ఇష్టా రాజ్యంగా వ్యవహరించడం, రాజకీయ పలుకుబడి ఉండడంతో ప్రభుత్వ మెడికల్ కళాశాల యాజమాన్యం చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇక్కడి పారిశుధ్య పనులపై కొందరు మెడికోలు బహిరంగంగానే విమర్శిస్తు న్నారు. బాత్‌రూమ్‌లు అధ్వానంగా ఉంటు న్నాయని, సంబంధిత శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని, దీంతో తాము అడ్జస్టు అవ్వాల్సివస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ కాలేజీ పరిస్థితి పైన పటారం.. లోన లొటారం మాదిరిగి ఉందని పలువురు పేర్కొంటున్నారు. బోధనపరంగా ఈ కళాశాల ఉత్తమం కావడంతో లక్షలు పెట్టి చదివిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు సైతం మౌనం దాలుస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వ మెడికల్ కళాశాల ఉన్నతాధికారులు స్పందించి కళాశాలలో పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని మెడిసిన్ చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



# బదిలీల టెన్షన్



* ఇప్పటికే వంశధార ఎస్ఈ, డీఈతో పాటు నగరపాలకసంస్థ కమిషనర్ బదిలీ
* మరికొందరు అధికారులు బదిలీ వేటు
* వైసీపీతో అంటకాగిన అధికారుల్లో ఆందోళన
* బదిలీ కాకుండా ఎమ్మెల్యేలు, మంత్రుల పేషీ చుట్టూ పైరవీలు

**హిరమండలం, జూన్ 26 (వార్త):** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో జిల్లాలో కొందరు అధికారులు, ఉద్యోగుల్లో భయం పటు కుంది. ఎవరు ఉంటారో, ఎవరు ఊడుతారో తెలియక ఆందోళన చెందు తున్నారు. ఇప్పటికే జిల్లా నుంచి వంశధార ఎస్ఈ, టెక్కలి డీఈలకు బదిలీ అయింది. ఐఏఎస్‌ల బదిలీల్లో భాగంగా నగరపాలక సంస్థ కమి షనర్‌ను ప్రకాశం కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. వైసీపీ ప్రభుత్వానికి అను కూలంగా పనిచేసిన అధికారులకు బదిలీ చేస్తామన టీడీపీ నేతలు బహిరం గంగానే చెబుతున్నారు. రెడ్‌బుక్‌లో పేర్లు ఉన్న వారిపై వేటు తప్పదని హెచ్చరికలు చేస్తున్నారు. అయితే కొందరు అధికారులు ఎమ్మెల్యేలు, మం త్రుల పేషీలు, క్యాంపు కార్యాలయాలు చుట్టూ తిరుగుతూ వారిని ప్రసన్నం చేసుకునే దిశ పనిలో పడ్డారు. ఎన్నికల మునుపు ఇతర జిల్లాల నుంచి జిల్లాకు వచ్చిన అధికారులు వారికి నచ్చిన ప్రదేశాలకు వెళ్లేందుకు పైరవీలు చేసుకుంటు న్నారు. వైసీపీ ప్రభుత్వంతోనూ, వైసీపి నేతలతోనూ సానుకూలంగా మెలిగేవారు,చెప్పినట్టు చేసిన అధికారులు, ఉద్యోగులు ఎవరనేది ఇప్పటికే కూటమి నేతలు ఆరా తీసి మండలాల వారీగా నివేదికను కూడా సిద్ధం చేశారు. వారందరికీ బదిలీ వేటు పడే అవకాశం ఉంది.

## రెవెన్యూ, పోలీసుల అతి..

శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి పలాసలో గౌతు శిరీషపై అక్కడి పోలీసులు మరీ అతిగా వ్యవహరించారు. ఆమె బయటకు వెళ్లకుండా కట్టడి చేశారు. ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ది అదే పరిస్థితి. టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడుకు సర్జరీ అయిన రెండు రోజులకే ఓ కేసు వ్యవహారంలో జైలుకు కూడా పంపించారు. కూన రవి కుమార్‌పై ఏకంగా 15 కేసులు పెట్టారు. శ్రీకాకుళంలో ఆయన ఇంటివద్ద పోలీసు నిఘా ఉంచారు. టెక్కలిలో ఎమ్మెల్సీ ఆదేశాల మేరకే టీడీపీ నేతలపై లెక్కలేనన్ని కేసులు పెట్టిన ఉదంతాలు కూడా ఉన్నాయి. రెవెన్యూ అధికారులదీ అదే పరిస్థితి. పలాసలో ఓ టీడీపీ కౌన్సిలర్ ఇంటిని కూల్చేందుకు అర్ధరాత్రి రెవెన్యూ, పోలీసులు హైడ్రామా నడిపారు. ఆమదాలవలసలో జనసేన నేతపై వైసీపీ నేతలు వీరంగం సృష్టించినా పోలీసులు మాత్రం అటువైపు కన్నెత్తిచూసిన దాఖలాలు లేవు. టెక్కలిలో ఓ ఎస్ఐ అయితే ... మిగతా 5లో

# సిక్కోలు యువకుడిపై దాడి

* మద్యం మత్తులో గొడవ
* ఓ యువకుడిని రాజాం తీసుకువెళ్లి చిత్రహింసలు



**రాజాం, జూన్ 26 (వార్త):** శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ యువకుడిని రాజాం తీసుకువెళ్లి చితగ్గొట్టిన వైనం మంగళవారం వెలుగులోకి వచ్చింది. రాజాం సీఐ శ్రీనివాస్ బుధవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 25న శ్రీకాకుళంలోని గుజరాతీపేటకు చెందిన గౌతమ్, కొంతమంది యువకులు రాజాం పట్టణంలోని గొల్లవీధిలో నిర్వహించిన వేడుక కోసం స్నేహితుల ఇంటికి వెళ్లారు. సాయంత్రం అంతా కలిసి పొనుగుటివలస కూడలిలోని డొంకల మిల్లు వద్దకు వెళ్లారు. అక్కడ అప్పటికే మద్యంమత్తులో ఉన్న కె.నవీన్, అతని స్నేహితులు వీరితో గొడవపడ్డారు. దీంతో భయపడిన గొల్లవీధికి చెందిన యువకులు పారిపోయారు. వారితో ఉన్న గౌతమ్‌ను ద్విచక్ర వాహనంతో సహా నవీన్, అతని స్నేహితులు బలవంతంగా రాజాం మండలం గురవాం గ్రామం సమీపంలోని కొర్లవలస కూడలి వద్దకు తీసుకెళ్లి.. ఇష్టానుసారంగా కర్రలు, బెల్టుతో కొట్టారు. గౌతం స్నేహితులు వారి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. రాజాం పోలీసులకు తెలియ జేయడంతో సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లడంతో వారంతా గౌతమ్‌ను రోడ్డుపై వదిలి పరారయ్యారు. తీవ్ర గాయాలపాలైన బాధితుడ్ని రాజాంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. నవీన్, అతని స్నేహితులపై హత్యాయత్నం, ఇతర నేరాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు. ఇప్పటికే ఆరుగురు నిందితులను పోలీసులు గుర్తించారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## కళింగపట్నంలో గ్రామసభ



**గార, జూన్ 26 (వార్త):** కళింగపట్నం గ్రామపంచాయతీలో ఉద్యానవనం మీద ఎన్ఆర్జిఎస్ ఆధ్వర్యంలో బుధవారం గ్రామసభ ఏర్పాటు చేశారు. టీడీపీ జిల్లా వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి, మాజీ సర్పంచ్ పొట్నూరు కృష్ణమూర్తి మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఉద్యావనాలను అభివృద్ధి చేశారన్నారు. ప్రస్తుతం వేతన దారులకు, సన్న, చిన్న కారు రైతులకు మొక్కలను సరఫరా చేసి వాటిని పెంచే దిశగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాన్ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. జులై ఒకన పింఛనుదారులకు ఏడు వేలు చొప్పున పింఛను అందుతుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ సెక్రెటరీ కిషోర్ కుమార్, లోకేశ్, లక్ష్మీనారాయణ, బిల్ కలెక్టర్ రాజేశ్వరి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# టెక్కలిలో.. దాహం కేకలు



* వర్షాలేక అడుగంటిన భూగర్భ జలాలు
* నీటి కోసం నానా ఇక్కట్లు పడుతున్న టెక్కలిప్రజలు
* గత ప్రభుత్వ వైఫల్యం.. టెక్కలి ప్రజలకు శాపం

**టెక్కలి, జూన్ 26 (వార్త):** డివిజన్ నియోజకవర్గ కేంద్రమైన టెక్కలిలో భూగర్భ జలాలు అడుగంటడంతో ప్రజలు నీటి కోసం అల్లాడుతున్నారు. వరుణుడి కరుణ చూపకపోవడం, గత ప్రభుత్వ వైఫల్యాలు టెక్కలి ప్రజల పాలిట శాపంగా మారింది. గుక్కెడు నీటికి కుళాయిల వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సివస్తోంది. టెక్కలిలో సుమారు 30 తాగునీటి బావులు, 90 బోర్లు ఉన్నాయి. భూగర్భ జలాలు అడుగంటడంతో బావులు ఎండిపోగా, బోర్ల నుంచి అరకొరగా నీరు వస్తోంది. 2016లో టెక్కలి పట్టణానికి పూర్తిస్థాయిలో నీరు అందించే పక్కా ప్రణాళికతో అప్పటి మంత్రి కింజరాపు అచ్చం నాయుడు సమగ్ర మంచినీటి పథకానికి రూపకల్పన చేశారు. కోట్లాది రూపాయల వ్యయంతో పూర్తిస్థాయిలో పట్టణానికి నీరందించే ప్రణాళికను రూపొందించారు. హిరమండలం వంశధార రిజర్వాయర్ నుంచి నీరుగా టెక్కలి పట్టణానికి నీరందించేలా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా జాతీయ రహదారి పక్కనే ఉన్న ఎర్రం నాయుడు రక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ఉన్న బోర్వెల్స్ ద్వారా పూర్తిస్థాయిలో నీరు అందించే పరిస్థితి లేకపోవడంతో సుమారు 50 ఎకరాల్లో ఒక చెరువును ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం వంశధార నీటిని ఈ చెరువుకు మళ్లించి వేసవికాలంలో ఈ నీటిని క్లోరినైజ్ చేసి ఈ పథకం ద్వారా ప్రజలకు నీరు అందించే ఉద్దేశంతో ఏర్పాటు చేశారు. అయితే గత ప్రభుత్వం ఈ మంచినీటి పథకాన్ని పట్టించుకోలేదు. గత ఏడాది వంశధార నీరు సైతం అంతంత మాత్రమే రావడంతో ఈ చెరువులో కూడా కనీస నీరు నిల్వ ఉంచలేదు. ఇదే ప్రస్తుతం టెక్కలిలో నీటి కొరతకు కారనంగా మారింది. ఎన్టీఆర్ కాలనీ, శ్రీనివాస్ నగర్‌తో పాటు మరికొన్ని వీధివాసులు నీటికోసం నానాయాతన పడుతున్నారు. ఎప్పటిలాగే రోజు ఉదయం అరగంటసేపు ఇస్తున్న కొళాయి నీరుపై ఆధారపడుతున్నారు.

### దువ్వాడ అత్యుత్సాహంతోనే..

టెక్కలి పట్టణంలోని నడిబొడ్డున ఉన్న పట్టుమహాదేవు కోనేరు అభివృద్ధిపై ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ చేసిన అత్యుత్సాహం పట్టణ ప్రజలకు శాపంగా మారింది. అలనాటి రాజరికపు తీపి గుర్తుగా ఏర్పాటు చేసిన పర్రు మహాదేవు కోనేరును అభివృద్ధి చేస్తానంటూ గత మూడేల్లుగా చుక్క నీరు లేకుండా వదిలేశారు. ఈకోనేరులో పూర్తిస్థాయి నీరు ఉంటే పట్టణ ప్రజలకు భూగర్భ జలాలు పెరిగి బోర్ వెల్స్ ద్వారా నీటి సౌకర్యం కలిగేది. ప్రస్తుతం ఆ పరిస్థితి కూడా లేదు. అంతేకాకుండా పట్టణ ప్రజలు వారి స్నానాలకు ఇతర అవసరాలకు కూడా ఈ కోనేరునే వాడుతుండేవారు.

### తాగునీటిపై శ్రద్ధ చూపని వైసీపీ

గత ఐదేళ్లగా పరిపాలించిన వైసీపీ టెక్కలిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. పెరుగుతున్న ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు కూడా రూపొందించలేదు. ఇందులో భాగంగానే ప్రస్తుతం టెక్కలి ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య ఈసారి అధికమైంది. ప్రస్తుతం కుళాయిలన్నీ దిష్టిబొమ్మల్లా మారాయి. పైపులైన్లు మరమ్మతులకు గురైనా కనీసం పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి.







### ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో బగాది సమీక్ష

టెక్కలి పట్టణంలో ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యపై బుధవారం ఉదయం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో టీడీపీ టెక్కలి మండల అధ్యక్షుడు బి.శేషగిరి సమీక్షించారు. సమగ్ర రక్షిత మంచినీటి పథకం ద్వారా ఏ మేరకు నీటిని అందించవచ్చున్న దానిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ మోహన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సమస్యను మంత్రి అచ్చంనాయుడు దృష్టికి తీసుకువెళ్లనున్నారు.

### పూర్తిస్థాయిలో తాగునీనే అందిస్తాం

ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితి వల్ల తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నయని పట్టణ ప్రజలకు పూర్తిస్థాయిలో మీరు అందిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ మోహన్ తెలిపారు. సమగ్ర రక్షిత మంచినీటి పథకం ద్వారా సుమారు 25 గ్రామాలకు రోజు 20 లక్షల లీటర్లు మీరు అందించే వాళ్లమన్నారు. ప్రస్తుతం సుమారు 12 లక్షలు లీటర్లు పట్టణ ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు. మరికొద్ది రోజుల్లో వర్షాలు పడితే ఈ సమస్య నుంచి గట్టెక్కే పరిస్థితి ఉంటుందన్నారు.





## బాబాయ్ అబ్బాయిల సన్మానానికి సన్నాహాలు

**టెక్కలి, జూన్ 26 (వార్త):** జిల్లా నుంచి రాష్ట్ర, కేంద్ర మంత్రులుగా ప్రాతినిధ్యం వహిస్తున్న బాబాయ్ అబ్బాయ్ లు కింజరాపు అచ్చం నాయుడు, కింజరాపు రామ్మోహన్ నాయుడులకు ఘన సన్మానం చేసేందుకు టీడీపీ నాయకులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బగాది శేషగిరిరావు ఆధ్వర్యంలో మండల నాయకులు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు. సమావేశంలో నాయకులు హనుమంతు రామకృష్ణ, కోళ్ల లవకుమార్. మట్ట పురుషోత్తం, మామిడి రాము, పోలాకి షణ్ముఖ రావు, ఇప్పిలి జగదీష్, మెండ దమయంతి, పొన్నాడ రాజారావు, పంగ తవిటయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెండు లారీలు స్వాధీనం



**గార, జూన్ 26 (వార్త):** బూరవల్లి గ్రామం వద్ద ఇసుకను ఆక్రమంగా రవాణా చేస్తున్న రెండు లారీలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ కృష్ణ ప్రసాద్ తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు గార, చింతాడ రహదారిలో వాహన తనిఖీలు చేశామని, ఈ సందర్భంగా ఎటువంటి అనుమతుల్లేకుండా లారీల్లో ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. లారీలను స్టేషన్‌కు తరలించి, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## దోమల నివారణతో మలేరియా నియంత్రణ

**సారవకోట/జలుమూరు, జూన్26 (వార్త):** దోమలను నివారించడంతో మలేరియాను నియంత్రించవచ్చని సారవకోట మండల టీడీపీ అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా సారవకోట మండలం గుమ్మపాడు పంచాయతీ గోపాలపురం గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెంకటరమణ పాల్గొని మాట్లాడారు. మన ఇంటితో పాటు చుట్టుపక్కల శుభ్రంగా ఉంచుకోవడం వల్ల దోమలను నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ సంతోష్ కుమార్, ఎమ్ఎల్ హెచ్ (ఫ్) పల్లి లక్ష్మి, ఎమ్ఎల్ హెచ్ పి గిరిజా, ఆశా కార్యకర్త కత్తిరి అనంతలక్షి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ చెంచాల వెంకటేష్, పంచాయతీ సెక్రటరీ లక్షి. గ్రామస్తులు పాల్గొన్నారు.



# మాదక ద్రవ్యాల వినియోగం చట్టరీత్యా నేరం

### టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి తేజ చక్రవర్తి మల్ల

**టెక్కలి, జూన్ 26 (వార్త):** మాదక ద్రవ్యాల వినియోగం చట్టరీత్యా నేరమని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి ఎస్.హెచ్.ఆర్.తేజ చక్రవర్తి మల్ల అన్నారు. బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమరవాణా దినోత్సవాన్ని పురష్కరించుకొని టెక్కలి ఔషధ నియంత్రణ అధికారి కార్యాలయంలో స్థానిక మందుల షాపుల యజమానులతో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సివిల్ జడ్జి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడకాన్ని తగ్గించాలని, అక్రమ రవాణాను నిర్మూలించాలన్నారు. యువతీ యువకులు మాదక ద్రవ్యాలకు బానిసలై తమ జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారని, భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరదాగా మొదలయ్యే ఈ అలవాటు చివరికి బానిసగా మార్చుతుందని, వీటి కోసం నేరాలు చేసేందుకు కూడా వెనుకాడడం లేదని, కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో టెక్కలి కోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు డి.వివేకానంద, న్యాయవాది ఎం.గాయత్రీ సాహిణి, ఔషద నియంత్రణ అధికారి ఎస్.యుగంధర్, మందుల షాపుల సంఘం ప్రెసిడెంట్ ఎస్.జగన్ పాల్గొన్నారు.



## మత్తుకు అలవాటు పడితే అధోగతే

**సోంపేట, జూన్ 26 (వార్త):** విద్యార్థులు మత్తుకు అలవాటపడి బానిసలుగా మారితే భవిష్యత్తు సర్వనాశనమై అధోగతి పాలవుతారని, ఈ వ్యవసనాలకు దూరంగా ఉండాలని కళాశాల విద్యార్థులకు బారువ పోలీసులు కోరారు. అంతర్జాతీయ మాదక పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం కొర్లాం బాలకృష్ణ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పోలీసులు ఉపాధ్యాయులుగా అవతారమెత్తి మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దుమ్ము లక్ష్మణరావు, డైరెక్టర్ రాంబుడ్డి గణపతి, అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు. అంతకుముందు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా సోంపేట పట్టణంలో పోలీసులు, అధ్యాపకులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## మాదకద్రవ్యాలతో జీవితం నాశనం



**మందస జూన్ 26 (వార్త):** మాదకద్రవ్యాలతో జీవితం నాశనం అవుతుందని సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.ఈశ్వరరావు అన్నారు. బాలిగాం వద్ద గల ఆదిత్య కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వాడడం వల్ల ఆరోగ్యం పాడవుతుందన్నారు. ఎవరైనా గంజాయి తరలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మందస ఎస్ఐ బి.అనిల్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ బొంగి ప్రవీణ్, మార్పు హరికృష్ణ ప్రసాద్, కళాశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

# వాలంటీయర్స్

* నాడు ఒత్తిళ్లతో రాజీనామాలు * నేడు కొనసాగించాలని వేడుకోలు * కూటమి నేతల చుట్టూ ప్రదక్షిణలు * ఇది ప్రస్తుతం రాజీనామాలు చేసిన వాలంటీర్ల పరిస్థితి



**సోంపేట, జూన్ 26 (వార్త):** ఎన్నికల ముందు నాటి అధికార వైసీపీ నాయకులు వత్తిళ్ల మేరకు పలు చోట్ల వాలంటీర్లు రాజీనామాలు చేశారు. ఈ రాజీనామాలు స్వచ్ఛందంగా చేసినవారు అతి తక్కువ. స్థానిక నాయకుల సిఫారసులు మేరకు వాలంటీర్లుగా నియమితులయ్యారు. వాళ్లలో ఎక్కువమంది వైసీపీ కార్యకర్తలే ఉన్నారు. రాష్ట్రంలో సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడంతో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు, విద్యాధికులు సైతం ఇందులో కొనసాగారు. గతంలో వాలంటీర్లను అక్రమ రవాణా దారులుగా ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి జన సేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఎన్నికల ముందు ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలపై కొంతమంది వాలంటీర్లు పవన్ పై కేసులు పెట్టేందుకు సిద్ధపడ్డారు. ఏ వ్యక్తి పైన అయితే వాలంటీర్లు కేసులు పెట్టారు ఇప్పుడు ఆ వ్యవస్థ ఆయన చేతుల్లోనే ఉండటంతో ఈ పదవులు కావాలని ఆ పార్టీ నేతల ముందు మోకరిల్లేదుంకు కొంతమంది భయపడుతున్నారు. కాగా వాలంటీర్ల వ్యవస్థలో ఉన్న మర్మం తెలియని చాలామంది పార్టీలతో తమకేమిటి సంబంధం గతంలో ప్రజలకు తామెలా సేవలందించామో ఈ పార్టీలో కూడా అదే తరహాలో సేవలు అందిస్తామన్న సద్బుద్ధితో ఇప్పుడున్న పార్టీ నేతలు వద్ద వాలంటీర్లుగా కొనసాగించాలని కోరుకుంటున్నారు. రాష్ట్రంలో మళ్లీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్న ధీమాతో ఆ పార్టీకి చెందిన అనేక మంది నాయకులు, గ్రామ వాలంటీర్లపై రాజకీయపరమైన వత్తిళ్లు తెచ్చి రాజీనామాలు చేయించారన్నమాట వాస్తవమేనని అందరూ అంగీకరించినా, అంగీకరించకపోయినా అది వాస్తవం. ఈ రాజీనామాలు తర్వాత టిడిపి ముఖ్య నాయకులు, కూటమిలో ఉన్న పలువుల నేతలు చేసిన వ్యాఖ్యలు తమని నొప్పించాయని అనేక మంది వాలంటీర్లు బహిరంగంగా ఆ నేతలపై తిరుగు బాటు బావుట ఎగురవేశారు. ఈ రాజీనామాలు వెనుక అధికార పార్టీ వత్తిళ్లు ఉన్నాయని తెలుగుదేశం పార్టీ నేతలు అప్పుడే చెప్పారు. ఎన్నికల ఫలితాల్లో వైసీపీకి ఊహించని రీతిలో ఓటమి పాలయింది. కూటమి రికార్డ్ స్థాయిలో అధికారంలోకి వచ్చింది. టిడిపి అధికారంలోకి వస్తే వాలంటీర్లను కొనసాగించడంతోపాటు వారికి పదివేలకు పెంచుతామని చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు చెప్పారు. టీడీపీ అధికారంలోకి రావడంతో అప్పట్లో రాజీనామాలు చేసిన వాలంటీర్లు దిక్కుతోచని పరిస్థితుల్లో తిరిగి మాకు అవకాశాలు కల్పించాలని తెలుగుదేశం పార్టీ నాయకులను కలుస్తున్నారు. తాము వైసీపీ నేతలు ఒత్తిళ్ల మేరకు రాజీనామాలు చేశాం తప్పితే వ్యక్తిగతంగా రాజీనామాలు చేయాలనే ఆలోచన కలగలేదని చెబుతున్నారు. టీడీపీ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వద్దకు ఈ జిల్లాకు చెందిన కొంతమంది స్వయంగా వెళ్లి కలవగా మీపై ఒత్తిళ్లు తెచ్చిన నాయకులపై కేసులు పెడితే వాలంటీర్ పోస్టు ఇచ్చే విషయంలో ఆలోచిస్తానని వారికి బదులిచ్చారు. ఇలాగే జిల్లాలోని గెలిచిన మిగిలిన ఎమ్మెల్యేలు వద్దకే కాకుండా గ్రామస్థాయిలో ఉన్న చోటా , బడా నాయకులు వద్దకు కూడా వెళ్లి వాలంటీర్లు తమ గోడును వినిపిస్తున్నారు. ప్రభుత్వ విధాన నిర్ణయం పై ఇది ఆధారపడి ఉంటుందని, అయినప్పటికీ తమ వంతు ప్రయత్నాలు చేసి మీకు న్యాయం చేయగలమని ఈ నాయకులు కొంతమేర భరోసా ఇస్తున్నారు. తెలుగుదేశం పార్టీలో ఉన్న నాయకుల్లో కొందరు వాలంటీర్లపై సానుకూలంగా ఉన్నప్పటికీ పార్టీ నిర్ణయం బట్టే ప్రభుత్వ ఆధారపడి ఉంటుంది .ఈ వాలంటీర్ల వ్యవస్థను రద్దు చేయడమా లేదా కొనసాగించడమా అనేది టిడిపి జాతీయ కార్యదర్శి ప్రస్తుత మంత్రి నారా లోకేష్, జనసేన పార్టీ అధినేత ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌ల పైనే ఆధారపడి ఉంటుంది. వీరిద్దరు ఎవరైనా ఈ వ్యవస్థను తిరిగి కొనసాగించాలని భావిస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వీరి మాటలకు తప్పకుండా విలువిచ్చి ఆ కోణంలో ఆలోచన చేయొచ్చు. వీరికి న్యాయం చేయడం అనేది వారిద్దరి చేతుల్లునే ఉంది. ఎన్నికలకు ముందు సుమారుగా 8500 మంది శ్రీకాకుళం జిల్లాలో రాజీనామాలు చేసిన వాలంటీర్లు ఆ తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా బహిరంగంగా ప్రచారాలు చేసారు. వీరి ప్రచార ఆర్భాటం గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ప్రత్యక్షంగా చూసి రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే వీరి సంగతి చూస్తామని అప్పుడే ఫిక్స్ అయ్యారు. వాలంటీర్లు వ్యవస్థ వల్ల నిరుద్యోగ యువతకు కొంతమేర ఉపాధి లభించవచ్చు గాని వీరు లేకుంటే వ్యవస్థకు కొత్తగా వచ్చే నష్టాలైతే ఏమి ఉండవని రాష్ట్రాభివృద్ధి కాంక్షించే వారి గట్టి నమ్మకం. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వాలంటీర్లతో అందివ్వకూడదని సిటిజన్స్ ఫర్ డెమోక్రటిక్ ఫోరం కోర్టు కు వెలితే వీరు ఉద్యోగులు కారు పార్టీ సేవకులేనని కోర్ట్ కూడా భావించి వారికిచ్చిన సరంజామా స్వాధీనం చేసుకోమని ఎన్నికల కమిషన్ కు ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా సచివాలయాల్లో పూర్తి స్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉండగా వీరితో పనేంటని ఘాటు వ్యాఖ్యలు కూడా చేసింది. ఎన్నికల సంధర్భంగా రాజీనామాలు చేసిన వారికే తిరిగి విధుల్లో తీసుకుంటామని వైకాపా నేతలు భయపెట్టడంతో భయపడి రాజీనామా చేసిన వారంతా ఇప్పుడు అధికారంలో ఉన్న నేతల ఇళ్లు చుట్టూ తిరుగుతున్నారు. ఇఛ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ ఇంటి వద్దకు మంగళవారం సాయంత్రం వెళ్లి రాజీనామాలు చేయలేదని, ఎన్నికలకు ముందు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మీటింగ్ అని చెబితేనే వెళ్లామని, అక్కడ కాగితాలపై సంతకాలు పెట్టమంటే పెట్టామని, అంతకు మించి తమకేమీ తెలియదని వాలంటీర్లు ఈ రకంగా ఆవేదన వ్యక్తంచేశారు. చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నిలబెడతారో, అసలు ఈ వ్యవస్థే వద్దనుకుంటారో వేసి చూడాల్సివుంది. ఏదిఏమైనప్పటకీ వాలంటీర్లు వ్యవస్థ అన్నది కేవలం పార్టీల పనులు కోసం పెట్టుకున్నదన్నదన్నది మెజారిటీ ప్రజల అభిప్రాయం.



## భేతాళపురంలో రక్తదాన శిబిరం

**మందస, జూన్ 26 (వార్త):** భేతాళపురంలో గ్రామ అభివృద్ధి కమిటీ సహకారంతో మాదకద్రవ్యల వాడకం, రవాణా వ్యతిరేక దినం సందర్భంగా పవనపుత్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో యువతకు అవగాహన కల్పించారు. పలాస ప్రాణదాత బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 26 మంది దాతలు రక్తం దానం చేశారు. ఈ శిబిరాన్ని ఎంపీటీసీ సూరాడ వాసుదేవరావు ప్రారంభించారు. అంతకుముందు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో యువత మత్తు పదార్ధాలు వైపు అకర్షితులు అవ్వకుండా ఆరోగ్యంగా జీవించాలని వక్తలు సూచించారు. ఈకార్యక్రమలో శ్రీ పవనపుత్ర సేవా సంస్థ వ్యవస్థాపకుడు మజ్జి భాస్కరరావు, అధ్యక్షులడు ఆశపన్న బాలరాజు, కార్యదర్శి రాపాక కేశవరావు, సంయుక్త కార్యదర్శి తిరుపతి గౌడ, గ్రామ పెద్దలు జుత్తు అప్పలస్వామి, దున్న తిరుపతి, దున్న నారాయణ, కీలు తవిటయ్య, తిమ్మాల గణేష్, తెప్పల పురుషోత్తం, కీలు సీతారాం, తాడల సుమన్, దున్న జగదీష్, సంగారు సంతోష్, దున్న అనిల్, యం సంతోష్, గుంటి రవి, సంస్థ సభ్యులు రుంకు తరకేశ్వరరావు, గై మన్మథరావు, బొడ్డు పురుషోత్తం, గుజ్జు రాము, బిల్లింగి ప్రకాశరావు, రాజమండ్రి అజయ్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**మందస, జూన్ 26 (వార్త):** తొలకరి వర్షాలు కురిసే సీజన్లో పాడి పశువులకు ప్రాణాంతకమైన గొంతు వాపు, జబ్బ వాపు, చిటుక వ్యాధి సోకే ప్రమాదం ఉందని, పాడి రైతులు వీటిపై అప్రమత్తంగా ఉండి వ్యాధి రాకుండా ముందస్తు వ్యాధి నిరోధక టీకాలను వేయించుకోవాలని మందస, హరిపురం పశువైద్యాధికారులు డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్, డాక్టర్ కిల్లి ఉమాభారతి సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గొంతువాపు వ్యాధి ఎక్కువగా గేదెలలో, అరుదుగా ఆవులు, గొర్రెలు మరియు మేకల్లో కూడా వస్తుంది. ఈ సీజన్లో పశువులు వర్షంలో తడవడం, ఎక్కువ దూరాలు ప్రయాణించడం, ఎక్కువసేపు ఎండలో ఉండటం, పోషణ సక్రమంగా లేకపోవడం వల్ల పాడి పశువులు ఈ వ్యాధి బారిన పడతాయన్నారు. ఈ వ్యాధి సోకిన పశువులకు తీవ్ర జ్వరం, ఆయాసం, గురకతో పాటు నాసికా రంధ్రాల నుంచి స్రవాలు కారుతూ ఉంటాయని తెలిపారు. వ్యాధి సోకిన పశువులకు వెంటనే వైద్యం అందించకపోతే 24 గంటల్లో మరణించే ప్రమాదం ఉందన్నారు. ఇక జబ్బ వాపు వ్యాధి, పాడి పశువుల్లో ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల వయసు గల ఆరోగ్యకరమైన, బలిష్టమైన పశువుల్లో వస్తుందని, ఈ వ్యాధి సోకిన పశువుల్లో తీవ్ర జ్వరము, ఆకలి మందగించుట, భుజంపై గాని తొడపై గాని నొప్పితో కూడిన వాపులు రావడం వలన పశు వులు సరిగా నడవలేవన్నారు. వ్యాధి సోకిన పశువులకు వెంటనే వైద్యం అందించకపోతే 24 గంటల్లో మరణించే ప్రమాదం ఉందని చెప్పారు. ఈ సీజన్లో వ్యాప్తి చెందే చిటుక వ్యాధి బారిన పడిన గొర్రెలు, మేకలలో తీవ్ర జ్వరము, పళ్ళు కొరకడం, వణకడం, బిగుసుకుపోవడం, కాళ్లతో పొట్టను తన్నుకోవడం, చెట్లకు గట్టిగా తలను ఆనించి ఉంచడం, శ్వాస కష్టమవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. కొన్నిసార్లు కళ్ళ ముందే ఎలాంటి లక్షణాలు లేకుండా హఠాత్తుగా గాలిలోకి ఎగిరి కిందపడి చనిపోతాయని తెలిపారు. పాడి రైతులు, పశువుల్లో వచ్చే ఈ ప్రాణాంతకమైన వ్యాధుల పట్ల అవగాహన పెంచుకొని, ముందస్తు వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాల్సిందిగా సూచించారు. మందస మండలంలో 1500 డోసుల గొంతు వాపు వ్యాధి నిరోధక టీకాలు, 1620 డోసుల జబ్బ వాపు వ్యాధి నిరోధక టీకాలు, 16000 డోసుల చిటుక వ్యాధి నిరోధక టీకాలు అందుబాటులో ఉన్నాయని, పాడి రైతులు మీ దగ్గరలో ఉన్న రైతు భరోసా కేంద్రాల ద్వారా ఈ వ్యాక్సిన్ ను ఉచితంగా వినియోగించుకోవాలని సూచించారు.

## 20 తులాల బంగారం చోరీ

**జలుమూరు, జూన్ 26 (వార్త):** తాళాలు వేసి వున్న ఇంటిని దొంగలు దోచుకున్నారు. వివరాల్లోకి వెళితే.. నరసన్నపేట పీఆర్ సబ్ డివిజన్ కార్యాలయంలో సీనియర్ సహాయకులుగా పని చేస్తున్న రేజేటి శ్రీనివాసరావు జలుమూరు మండలం నగరికటకంలో నివాసముంటున్నాడు. పెద్ద కుమారుడు హైదరాబాద్‌లో ఉంటున్నాడు. అతని ఆరోగ్యం బాగోలేనందున కుటుంబ సభ్యులతో కలిసి శ్రీనివాసరావు ఈనెల 21న హైదరాబాద్ వెళ్లాడు. తిరిగి బుధవారంఇంటికి వచ్చి తాళాలు తీశాడు. ఇంటి ఉత్తరం వైపు గడియ తెరిచి వుండ డాన్ని చూసి బీరువా తెరిచి చూడగా సుమారు 20 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్టు గమనించాడు. వెంటనే జలుమూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ మధుసూదనరావు కేసు నమోదు చేశారు.



## విద్యార్థుల పట్ల అప్రమత్తంగా ఉండాలి సీఐ దివాకర్



**ఆమదాలవలస, జూన్ 26 (వార్త):** పాఠశాలలకు ఆటోల్లో వెళుతున్న విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సర్కిల్ ఇన్స్పెక్టర్ వాయునందన్ దివాకర్ అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులను ఆటో తరలిస్తున్న డ్రైవర్ ఎటువంటి వ్యక్తి అనేది పరిశీలించాలన్నారు. ఆటోలో విద్యార్థులను పరిమితికి మించి ఎక్కించకుండా చూడాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని డ్రైవర్లను హెచ్చరించారు.

## రుణాలన్నింటికీ డాక్యుమెంటేషన్ తప్పనిసరి

**ఆమదాలవలస, జూన్ 26 (వార్త):** మహిళా స్వయం శక్తి సంఘాలకు గ్రామ సంఘాల ద్వారా ఇప్పిస్తున్న అన్ని రకాల రుణాలకు కూడా మైక్రో క్రెడిట్ ప్లాన్‌తో సహా సరైన డాక్యుమెంటేషన్ ఉండేటట్లు చూడాలని వెలుగు ఏరియా కోఆర్డినేటర్ పి రవికుమార్ సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో అధ్యక్షురాలు తమ్మినేని ధనలక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామ సంఘాల ద్వారా అందిస్తున్న సి.ఐ.ఎఫ్. రుణాలకు శ్రీనిధి, ఉన్నతి రుణాలకు సభ్యురాల వారి, సంఘం వారి వివరాలతో డాక్యుమెంటేషన్ తయారుచేసి మండల సమాఖ్యలో భద్రపరచాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఏపిఎం. పైడి కూర్మారావుతో పాటు క్లస్టర్ కోఆర్డినేటర్లు, లీగల్ కోఆర్డినేటర్ జానకిరామ్ పాల్గొన్నారు.

## జనసేన కార్యకర్త కామేశ్వరరావుకు పరామర్శ



**ఆమదాలవలస, జూన్26 (వార్త):** పొందూరు మండలం లుట్టపేట గ్రామంలో జనసేన క్రియాశీలక కార్యకర్త కండ కామేశ్వరరావుకు చెందిన ఇల్లు ప్రమాద వశాత్తు కాలిపోయింది. విషయం తెలుసుకున్న నియోజకవర్గ ఇంచార్జీ పేడాడ రామ్మోహన్‌రావు బుధవారం కామేశ్వరరావుకు పరామర్శించారు. నిత్యావ సర వస్తువుల అందజేయడంతో పాటు అండగా ఉంటామని రామ్మెహన్‌రావు హామీ ఇచ్చారు. ఆయన వెంట మండల నాయకులు, కొంచాడ సూర్య, పొన్నాడ బాలకృష్ణ, కోరాడ రాజు, దినేష్, దుర్గాప్రసాద్, చిన్నారావు, రాజేష్ ఉన్నారు.

## ప్రజారోగ్యం పట్ల అలసత్వం వద్దు

**హిరమండలం, జూన్ 26 (వార్త):** ప్రజా ఆరోగ్యం పట్ల అలసత్వం వహించవద్దని జెడ్పీటీసి పొగిరి బుచ్చిబాబు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో డీడీ స్వరూపా రాణి ఆధ్వర్యంలో ప్రజారోగ్య విద్య అవగాహన, అంటురోగాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు అనే అంశంపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజా ఆరోగ్యంపై దృష్టి సారించలేదన్నారు. మండలంలో ఎంఎల్‌పురం, సత్యజగన్నాధపురం, పూనిపేట తదితర గిరిజన గ్రామాల్లో తాగునీటి ఎద్దడితో కొండజక్కర నీటినే ఉపయోగిస్తున్నారన్నారు. ఆయా గిరిజన గ్రామాల్లో గిరిజనులు మూత్ర పిండ వ్యాధితో బాధపడుతున్నారని, వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సమావేశంలో వైద్యాధికారి సీహెచ్ సాయిగీత, సిబ్బంది ఉన్నారు.

## ఎండోమెంట్ ఈఓ ఆకస్మిక తనిఖీ

గార, జూన్ 26, వార్త: గార మండలం కళింగపట్నం, పెద్దపల్లి పేటలో వేంచేసి ఉన్న శ్రీ కోదండ రామాలయం, బాలశశిశేఖర ఆలయమును ఆకస్మికంగా దేవాదాయ, ధర్మాదాయ ఈవో తమ్మినేని రవి బుధవారం సాయంత్రం పరిశీలన చేశారు.

అర్చక స్వాములు, గ్రామ పురజనులతో దేవాలయాల అభివృద్ధి గురించి చర్చించడం జరిగింది.

అదేవిధంగా ఆరంగిపేటలో వేంచేసియున్న బుద్ధిగారమ్మ అమ్మవారి దేవాలయంను కూడా పరిశీలించి ఆలయ అభివృద్ధి కొరకు చర్చించడం జరిగింది.



# విస్తృతంగా పారిశుధ్య డ్రైవ్‌లు నిర్వహించాలి



పార్వతీపురం/ పాలకొండ,వార్త జూన్ 26 : వర్షాకాల సీజనల్ వ్యాధులు, విషజ్వరాలు ప్రబలకుండా గ్రామాల్లో విస్తృతంగా పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. పాలకొండ నగర పంచాయితీ పరిధిలోని కస్పా వీధి, గరుగుబిల్లి మండలం తోటపల్లి గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను బుధవారం పరిశీలించారు. ఆవాసాల ముందు మురుగు కాలువలలో నీరు నిల్వ ఉండటం గమనించి మున్సిపల్ కమిషనర్ సర్వేశ్వర రావును ప్రశ్నించారు. మురుగు కాలవల్లో నీరు పారే విధంగా కాలువల్లో పూడికతీత పనులు నిర్వహించాలన్నారు. చేతి పంపు కొలాయిల వద్ద, మురుగు కాలువల్లో దోమలు వృద్ధి చెందకుండా లార్వా నిర్మూలనకు క్లోరినేషన్ పిచికారి పనులు జరిపించాలని అన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా పనులు చేపట్టాలన్నారు. నీరు కలుషితం కాకుండా మంచినీటి సరఫరా పైపులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజలు అంటు వ్యాధులు, మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాల బారిన పడకుండా ఇప్పటికే పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గరుగుబెల్లి మండలం తోటపల్లి గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులు నిర్వహిస్తున్న మురుగు కాలువల్లో పూడికతీత పనులు నిశితంగా పరిశీలించారు. జల జీవనం మిషన్ క్రింద ఏర్పాటు చేసిన ఇంటింటికీ తాగునీరు కొలాయిలు ప్రజలు సరిపడా తాగునీరు అందుతున్నది లేనిది అడిగి తెలుసుకున్నారు. నాలుగు వేల లీటర్ల నీరు సామర్థ్యం గల తాగునీటి ట్యాంకు ద్వారా సరిపడా తాగునీరు అందిస్తున్నట్లు అర్ డబ్ల్యూ ఎస్ అధికారులు తెలిపారు. మంచినీటి ట్యాంక్ శుభ్రతకు వినియోగించే కిట్లు అందుబాటులో ఉన్నాయా, ఎప్పుడు శుభ్రపరిచినది, నీటి పరీక్షలు నిర్వహణ చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో పాలిథిన్ కవర్లు, చెత్త పేరుకుపోకుండా ఉండేందుకు ప్రజలకు అవగాహన కల్పించి పరిసరాల పరిశుభ్రత పాటించేలా భాగస్వామ్యం చేయాలని అన్నారు.



స్టాప్ డయేరియా డ్రైవ్‌లు

గ్రామాల్లో డయేరియా వంటి అంటు వ్యాధులు ప్రభలకుండా ప్రత్యేక డ్రైవ్ లు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. పాలకొండ పట్టణం నీలమ్మ కాలనీలోని అంగన్వాడీ కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. చిన్నారులకు చేతులు పరిశుభ్రంగా కడుక్కోనే విధానాన్ని అవగాహనతోపాటు అలవరచాలని అన్నారు. చిన్నారులతో మాట్లాడి చేతులు ఎలా శుభ్రం చేసుకోవాలో అడిగి వారిలోని అవగాహనను పరీక్షించారు. అంగన్వాడీ కేంద్రంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్, పాలిక్ యాసిడ్ వంటి మాత్రలను నిల్వ ఉంచాలని ఐ సి డి ఎస్ ప్రాజెక్ట్ అధికారి సింహాచలం ను ఆదేశించారు. డయేరియా వంటి కేసులు నమోదు అయ్యాయా అనే విషయాలను ఆరా తీశారు. అంగన్ వాడి కేంద్రం నిర్వహణ పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో వైద్య అధికారులు శిబిరాలు నిర్వహించి అనుమానిత లక్షణాలు ఉన్న వారి రక్త నమూనాలు పరీక్షించి డయేరియా నిర్మూలనకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ కె వరహార్, ఎంపీడీవో సూర్యనారాయణ, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

## మహానంది జాతీయ పురస్కారానికి కృష్ణారెడ్డి ఎంపిక



ఇచ్ఛాపురం, జూన్ 26 వార్త: తెలుగు వెలుగు సాహితి వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మాజీ భారత ప్రధాని భారతరత్న పివి నరసింహారావు జయంతి ఉత్సవాల 2024ను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన మహానంది జాతీయ పురస్కారాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురానికి చెందిన శాస్త్రీయ సంగీత కళా రంగంలో చేస్తున్న విశిష్టమైన సేవలను ఆశీ కృష్ణారెడ్డిని తెలుగు వెలుగు మహానంది జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలుగు వెలుగు సాహితి వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ జాతీయ చైర్మన్ పోలోజు రాజ్ కుమార్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వలబోజు మోహన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ హోదాల్లో సామాజిక సాంఘిక శాస్త్రీయ సంగీతం విద్యా సేవా కార్యక్రమంలో పాటు తెలుగు వెలుగు భాషాభివృద్ధికి తోడ్పడుతున్న సందర్భంగా ఈయనని ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. ఈనెల 30వ తేదీ తెలంగాణలోని కరీంనగర్‌లో జరిగే కార్యక్రమంలో అతిధుల చేతుల మీదుగా కృష్ణారెడ్డికి పురస్కారం ప్రదానం చేయనున్నట్లు వారు తెలిపారు.

## "ఉపాధి" హామీపై ఎమ్మెల్యే శిరీష సమీక్ష



పలాస, జూన్ 26 వార్త: నియోజకవర్గంలోని అన్ని శాఖలతో పాటు ముఖ్యంగా గ్రామీణ ఉపాధి పథకం అమలు తీరుపై సమీక్ష సమావేశం పలాస ఎమ్మెల్యే శిరీష పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి పని కల్పించాలని, ప్రతి పింఛన్‌దారులకు ఇంటి వద్ద పింఛన్ పంపిణీ చేయాలని, ఉపాధి హామీ పథకం ద్వారా చెరువులు, కాలువలు పూడిక తీత త్వరగా చేయాలన్నారు. తద్వారా ముందుగా అన్ని చెరువులు నీటితో నింపి రైతులకు సాగునీరు అందించాలని తెలిపారు. వజ్రపుకొత్తూరు మండలంలో మత్స్యకార కుటుంబాలకు వేట నిషేధ సమయంలో ఏవిధంగా ఉపాధి అవకాశాలు కల్పించగలం అన్న దానిపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాల మండలం అదికారులు, ఎన్ ఆర్ జి ఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఖరీఫ్ పంటకు పూర్తిస్థాయిలో సాగునీరు

### ఎమ్మెల్యే గొండు శంకర్



శ్రీకాకుళం, వార్త జూన్ 26: ఖరీఫ్ పంటకు పూర్తిస్థాయిలో సాగునీటిని అందిస్తామని శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. భాగంగా సాగునీటి కాలువల మరమ్మత్తు పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు అయన తెలిపారు. స్థానిక వంశధార ప్రాజెక్ట్ సర్కిల్ కార్యాలయంలో సాగునీటి సరఫరా పై ఇంజనీరింగ్ అధికారులతో బుధవారం అయన సమీక్ష నిర్వహించారు. ఇటీవల వంశధార కుడి ప్రధాన కాలువ పరిశీలనలో గుర్తించిన సమస్యలపై అరా తీశారు. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతను ఇస్తుందని, రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో చిట్ట చివరి భూములకు సైతం సాగునీరందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సాగునీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూడాలని, గుర్రపుడెక్క, పూడిక తీత పనులు చేపట్టాలని, మరమ్మత్తు పనులు అవసరమైతే యుద్ధప్రాతిపదికన చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో వంశధార ఎస్ఈ బి.రాంబాబు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

## లొద్దపుట్టిలో బడికి పోదాం



ఇచ్ఛాపురం, జూన్ 26, వార్త: లొద్దపుట్టి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో బడికి పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ర్యాలి జరిగింది. ర్యాలీలో హెచ్ ఎం ఉషారాణి, సురేశ్ పండా, మురళీ దర్,వెంకట రమణ, అప్పల నాయుడు, ఊర్మిల తదితరులు పాల్గొన్నారు. డ్రాప్ ఔట్స్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు హెచ్‌ఎం తెలిపారు.బొడ్డ బడ భవాని ప్రధాన్ అనే అమ్మయి 8వ తరగతి చదువుతూ బడి మాని వేసింది. తనకు మరల ఈ రోజు 8 వ తరగతిలో జాయిన్ చేశారు. హెచ్ ఎమ్ వాసుదేవ రావు, నరేంద్ర పట్నాయక్, హరినరాయన తదితరులు పాల్గొన్నారు.

## చెడు వ్యసనాలకు యువత బానిస కావొద్దు



ఇచ్ఛాపురం, జూన్ 26, వార్త: చెడు వ్యసనాలకు యువత బానిస కావొద్దు అని సిఐ టి.ఇమ్మానుఎల్ రాజు అన్నారు. స్థానిక జ్ఞాన భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు తో యాంటీ డ్రగ్స్ డే సందర్భంగా ఇచ్ఛాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. పాఠశాలకు మాత్రమే ప్రత్యేకంగా ఉన్న స్టూడెంట్ పోలీస్ క్యాడెట్, 8, 9 మరియు10వ తరగతి విద్యార్థులు సుమారు 200 మంది ఈ ర్యాలీలో పాల్గొన్నారు. పాఠశాల నుండి ర్యాలీగా ఇచ్ఛాపురం పోలీస్ స్టేషన్కు తరలివెళ్లి, అక్కడ ర్యాలీలో పాల్గొనడం జరిగింది. ప్రత్యేకంగా ప్లకార్డులతో విద్యార్థులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. పాఠశాల ఎస్‌పిసి విద్యార్థులను సర్కిల్ ఇన్స్పెక్టర్ ఇమాన్యువల్ రాజు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జ్ఞాన భారతి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సీఈవో కార్యదర్శి జోహార్ ఖాన్, ట్రష్టి వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఇందూ భూషణ్ పండా, పి ఈ టి లు కైలాష్ కుమార్ పండా, రాము తదితరులు పాల్గొన్నారు.

## భారీగా గంజాయి ఎగుమతి

### పలాస రైల్వే అధికారులకు అధికారులకు పట్టుబడ్డ గంజాయి



పలాస జూన్ 26 (వార్త): ప్రభుత్వం గంజాయి లాంటి మొత్తం మందులను అరికట్టేంత వీధిగా మంత్రులు సబ్ కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విషయం తెలిసింది. అందుకోసం మాదక ద్రవ్యాల వాడకంపై అవగాహన సదస్సు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సందర్భంగా, పలాసలో కూడా పలాస ఎమ్మెల్యే ఇది గౌతు శిరీష ఆధ్వర్యంలో మత్తు పదార్థాలు నియోజవర్గం రాకుండా చేయాలని పోలీసులకు ఆదేశించారు. అయితే అదే రోజైన బుధవారం నాడు పలాస రైల్వే అధికారులకు భారీగా గంజాయి పట్టుబడింది. ఈ విషయం రైల్వే అధికారులు ధ్రువీకరించారు. మహారాష్ట్ర నుంచి ఒడిస్సా మీదగా గంజాయిను అక్రమంగా తరలిస్తుండగా పలాస రైల్వే అధికారులు ప్లాట్ఫారం రెండు మూడులో ముందుకు సమాచారంతో తనిఖీ నిర్వహించారు. అనుకున్నట్టుగా గంజాయి అక్రమంగా తలుస్తున్న వారిని అదుపులో తీసుకున్నారు. శ్రీకాకుళం అలాగే విశాఖపట్నం నుంచి చెందిన రైల్వే అధికారులు ముందస్తు సమాచారంతో పలాస రైల్వే స్టేషన్లో పట్టుకున్నారు. వీటి విలువ వేలల్లో ఉంటుందని అధికారులు చెబుతున్నారు. పట్టుకున్న గంజాయిని సీజ్ చేస్తూ, నిందితుల్ని విశాఖపట్నం తరలించినట్టు రైల్వే పోలీసులు తెలిపారు.




## ఎమ్మెల్యేకు జన నీరాజనం

శ్రీకాకుళం రూరల్(కిష్టపేట) వార్త 26 జూన్: 16వ శాసనసభ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసి స్వగ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే గొండు శంకర్‌కు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. తమ గ్రామ యువకుడు, అందరి అభిమానాన్ని చూరగొన్న నేత ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో ఎన్నిక కావడంతో గ్రామస్తుల ఆనందానికి అంతు లేకుండా పోయింది. అందుకు తగినట్లుగానే ఘనస్వాగతం పలికి అంతే వైభవంగా ఆత్మీయ సత్కారం నిర్వహించారు. గ్రామానికి చేరుకున్న గొండు శంకర్ ను మేళతాళాలు, భాజా భజన్త్రీలు, బాణసంచా వెలుగులు నడుమ గ్రామంలో సంబరాలు జరిపారు. భారీ ఊరేగింపు అనంతరం శంకర్ ను గ్రామానికి చెందిన ప్రతీ ఒక్కరు ఆత్మీయంగా సత్కరించారు.



## ప్రారంభానికి సిద్ధంగా బస్ షెల్టర్



ఇచ్ఛాపురం, జూన్ 26 వార్త: సుమారు 2 లక్షల రూపాయల వ్యయం అంచనాతో పురుషోత్తపురం బస్ షెల్టర్ నిర్మాణం పూర్తి కావస్తోంది. ఈ షెల్టర్ జులై మొదటి వారంలో ప్రారంభించడానికి రోటరీ క్లబ్ ఏర్పాట్లు చేస్తున్నట్లు అసిస్టెంట్ గవర్నర్ పి.దినేష్ ప్రెసిడెంట్ రోహిత్, సెక్రటరీ రాజ్ కుమార్, ప్రోజక్ట్ చైర్మన్ పి.తులసీదాస్‌లు తెలిపారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

**నియోజకవర్గంలోకి మత్తు పదార్థాలు రాకుండా చర్యలు తీసుకోవాలి**

**ఎమ్మెల్యే గౌతు శిరీష**





పలాస జూన్ 26(వార్త): మాదక ద్రవ్యాలకు యువత రము దూరంగా ఉండాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పిలుపునిచ్చారు. ఈ మేరకు పలాస నియోజకవర్గం లోకి మత్తు పదార్థాలు రాకుండా చుడాలని పోలీసు శాఖ ను కోరారు. అవగాహన సదస్సు నిర్వహించ్చారు. ఇందులో మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు., పలాస మున్సిపాలిటీ ఉన్నత పాఠశాల లో డ్రగ్స్ ఫ్రీ గా మార్చాలని అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాలు మాదక ద్రవ్యాల నివారణ (నార్కోటిక్స్ డ్రగ్స్ సైకోట్రోపిక్ పదార్థాలు, ఎన్డిపిఎస్)పై డిఎస్పీ నాగేశ్వర రెడ్డితో కలిసి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ నియోజకవర్గం లోకి మత్తు పదార్థాలు రాకుండా అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని, జిల్లాలో ఉన్న సరిహద్దు మండలాల పరిధిలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. , మత్తు పదార్థాలు వినియోగించే అవకాశం ఉంటుందని, జిల్లాలో కొత్తగా కేసులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో అప్రమత్తత అవసరమన్నారు. మత్తు పదార్థాలు %ಆ% మాదక ద్రవ్యాల వినియోగంపై ప్రతి పాఠశాలలు, కాలేజీలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మత్తు పదార్థాలు ఎలా తయారు చేస్తారు, వాటిని వాడితే ఏం అవుతుంది అని దానిపై విద్యార్థులకు అవగాహన కల్పించడం ముఖ్యమన్నారు. పాఠశాలలు, కాలేజీలలో వారానికి ఒకటి రెండు సార్లు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జిల్లాలోని మేజర్ జంక్షన్లు, పట్టణాల్లో ప్రజలకు




అవగాహన కల్పించేందుకోసం హోర్డింగ్ లు ఏర్పాటు చేయాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారులు ఎక్కడైనా గంజాయి ఇతర మత్తు పదార్థాల పంటలు సాగు చేస్తే సమాచారం అందించాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుని పనిచేసి డ్రగ్స్ ఫ్రీ జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా డిఎస్పీ నాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ జిల్లాను డ్రగ్స్ ఫ్రీ జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి దొరికితే ఎక్కడి నుంచి తెస్తున్నారు, ఎవరికి సరఫరా చేస్తున్నారు, ఎవరు వాడుతున్నారు లాంటి పూర్తి సమాచారం సేకరిస్తున్నామన్నారు. మత్తు పదార్థాలు అరికట్టడంపై ప్రభుత్వ గైడ్లైన్స్ ని పాటించాలన్నారు. మత్తు పదార్థాలు వాడకుండా ప్రాంతాలపై దృష్టి పెట్టాలన్నారు. పాఠశాలలు, కళాశాలలలో మత్తు పదార్థాల వాడకంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఎవరైనా గంజాయి సాగుచేసిన తమకు సమాచారం అందించాలన్నారు. మత్తు పదార్థాల వాడకంపై గ్రామాల్లో పోలీసుల ద్వారా పోస్టర్లు అంటించాలని, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రాష్ట్రాన్ని డ్రగ్స్ ఫ్రీ స్టేట్ గా మార్చాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. ఆదేశాల మేరకు జిల్లాను డ్రగ్స్ ఫ్రీ జిల్లాగా మార్చాలన్నారు. ఎవరైనా డ్రగ్స్ వాడుతున్నా, డి అడిక్షన్ సెంటర్కు వెళ్లాలన్నా 14500 అని టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పోలీసులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలపై గట్టి నిఘా....

**ఆగని గంజాయి అక్రమ రవాణా**

**ఒడిశా, మహారాష్ట్రల మీదుగా రవాణా**

**కరుడు గట్టిన మాఫియా ముఠాపై కఠిన చర్యలు**



పలాస జూన్ 16, వార్త : కొత్త సర్కారు కొలువు తీరినప్పటికీ గత ప్రభుత్వంలో మాదిరిగా మాదక ద్రవ్యాలు ఎగుమతి దిగుమతులు విధానంలో మార్పు లేదు అని చెప్పక తప్పదు. వచ్చి రావడంతో గంజాయి లాంటి మత్తు పదార్దాలను అరికట్టేందుకు వీలుగా అన్ని ముందుస్తూ చర్యలు తీసుకుంటున్న సందర్భమున్లో ఇలా సేవ్ పలాసపై బురద జల్లేందుకు వీలుగా గంజాయి అక్రమ రవాణ జరగడం పలాస రైల్వే అధికారులకు పట్టు బడటం వెనుక సర్కార్కు బదనాం చేసేందుకు చేసే చర్యలు లాగే ఉందని ఇక్కడ వాసులు అంటున్నారు.కూటమి సర్కార్ నిబంధనలు దాటి వెళ్లేందుకు వీలు లేదని ముఖ్యమంత్రితో పాటు ఉపముఖ్యమంత్రులు అయిన నారా చంద్రబాబు నాయుడు, అలాగే కొణిదల పవన్ కళ్యాణ్ల పాలనలో అవినీతికు తోవలేదు. రాష్ట్ర అధికారులు ఆదేశాలు మేరకు పలాస రైల్వే స్టేషన్ వద్దగంజాయి అక్రమ రవాణపై అధికారులు ముందుస్తూ చర్యలలో భాగంగా పలాస రైల్వే స్టేషన్లో మాటు కాసి అక్రమ గంజాయిను పట్టుకున్నారు.

## డ్రగ్స్ వద్దు ...ఆరోగ్యమే ముద్దు

**విద్యార్థులకు సూచించిన ఎస్సై కళాధర్**



వీరఘట్టం జూన్ 26 వార్త: డ్రగ్స్ వద్దు... ఆరోగ్యమే ముద్దు అనే నినాదంతో ప్రతి ఒక్క విద్యార్థి ముందుకు సాగాలని ఎస్సై జి.కళాధర్ విద్యార్థులకు సూచించారు బుధవారం స్థానిక శ్రీ గాయత్రి జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు .చదువుకున్న వయసులో విద్యార్థులు ,యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆయన అన్నారు ఈ మత్తు పదార్థాలు కు అలవాటు పడితే విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందని దీనివల్ల తల్లిదండ్రులకు క్షోభ పెట్టిన వారవుతారని ఆయన గుర్తు చేశారు .యువత చదువుకునే వయసులో అటువంటి కేసులో భాగస్వాములు అయితే ఉద్యోగ అవకాశాలు కూడా కోల్పోతారని ఆయన అన్నారు .చిన్న వ్యసనమే జీవితాలను చిన్నాబిన్నం చేసి సమాజంలో భయాందోళన గురి చేయడమే కాకుండా నేర ప్రవృత్తి వైపు మళ్లించేందుకు ఆస్కారం ఉంటుందని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ సమిష్టిగా మాదక ద్రవ్యాలను వ్యతిరేకించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు .మత్తు పదార్థాలకు బానిస కాకుండా చదువుపై దృష్టి సారించాలని ఎస్సై విద్యార్థులకు హితబోధ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎస్.లోకేష్, ప్రిన్సిపాల్ కే .సింహాచలం విద్యార్థులు ,సిబ్బంది తదితరులు ఉన్నారు.

## బదిలీల టెన్షన్

(మొదటిపేజి తరువాయి)

ఎమ్మెల్సీ పుట్టిన రోజు వేడుకల్లో నృత్యం కూడా చేశాడు.

**రెవెన్యూ, పోలీసులే టార్గెట్..**

తహశిల్దార్లు, సీఐలు, ఎస్ఐలు ఎక్కువ మంది బదిలీ అయ్యే అవకాశం ఉంది. వైసీపి ప్రభుత్వంలో రెవెన్యూ కుంభకోణాలకు పాల్పడి వైసీపి నేతలు చెప్పినట్టు చేసిన ఉద్యోగులను ఏరిపారేసే అవకాశం ఉంది. పోలీస్ స్టేషన్లను సెటిల్మెంట్ కేంద్రాలుగా మార్చి, కొందరు బ్లాక్మెయిర్ల చేత అమాయకులపై కేసులు పెట్టించి, డబ్బు దండుకున్న సీఐల మీద కూడా వేటు పడే అవకాశం ఉంది. తప్పుడు ఫిర్యాదుదార్లను ఏకంగా స్టేషన్ల లోపలకే రప్పించుకుని వారితోటే ఫిర్యాదులు చేయించి తప్పుడు కేసులు బనాయించిన సీఐలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

**సిఫారసులకు ప్రయత్నాలు...**

కొందరు పోలీసులు, రెవెన్యూ అధికారులు ఎక్కువగా ఎమ్మెల్యేల సిఫారసు లెటర్ల కోసం చూస్తున్నారు. ఎంఎల్ఏలు కూడా గతంలో తమ పట్ల దురుసుగా వ్యవహరించిన అధికారులెవరూ ఉండకూడదనే అభిప్రాయంతోనే ఉన్నారు. పాలన కొత్తగా ఉండాలని, పక్షపాతం లేకుండా అధికారులు వ్యవహరించాలన్న ఆలోచనలో ఉన్నారు.

## అసంపూర్తిగా రోడ్డు పనులు

**పలాస, జూన్ 26(వార్త):** కాశీబుగ్గ నుంచి వజ్రపు కొత్తూరు వరకు వేసిన రోడ్డు విస్తరణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో వాహనాలు నడిపే వారు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు ఎక్కడికక్కడ గోతులు ఉండడంతో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. అలాగే వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. పలాస ఎమ్మెల్యే శిరీష స్పందించి ఈ రోడ్డుకు పడిన గోతులను పూడ్చడంతో పాటు పూర్తిస్థాయిలో నిర్మించాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.



## డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటం బహుకరణ



ఇచ్ఛాపురం జూన్ 26, వార్త: ఇచ్ఛాపురం మండలం, మండపల్లి గ్రామానికి చెందిన పాతిర్ల సర్వన్ ఇచ్ఛాపురం రవీంద్రభారతి పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. తండ్రి మాజీ సైనికోద్యోగి. అతనికి ముగ్గురు సంతానం, చిన్న వాడైనా సర్వన్ మొదటి నుండి కళలపై ఆసక్తి ఎక్కువ. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్ డిప్యుటీ సీఎం పవన్ కళ్యాణ్ పై వున్న ఎనలేని అభిమానంతో 4రోజులు పాటు మండుటెండలో ఎంతో శ్రమించి సన్ లైట్ ఆర్ట్ను చిత్రికరించినట్లు చిత్రీకకరించాడు. ఈ సన్ లైట్ ఆర్ట్ను ఇచ్ఛాపురం నియోజకవర్గ జనసేన నాయకులు దాసరి రాజుకు జనసేన పార్టీ కార్యాలయానికి వచ్చి అందజేశారు. ఈ సందర్భంగా దాసరి రాజు మాట్లాడుతూ సర్వన్ పలువురుకి ఆదర్శప్రాయమని బావి తరాల భవిష్యత్కు భరోసా కల్పించే నాయకుడు పవన్ కళ్యాణ్ నని, అతనిపై వుండే అభిమానంతో సన్ లైట్ ద్వారా చిత్రికరించడం అభినందనీయమని అన్నారు. తనలోని ప్రతిభకి ప్రోత్సాహం అందించవలసిందిగా తల్లిదండ్రులను అభ్యర్థించి, సర్వన్ కు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రొకళ్ల భాష్కర్ శేఖర్ ,దంగుభాష్కర్ ,నాగరాజు, రుకామెందరా ,కాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

## బొడ్డపాడు రేవటి భూముల
# కొనుగోలులో అవకతవకలు

**విచారణ జరిపించాలి: ఎమ్మెల్యే గౌతు శిరీషకు**

**దేశం నేతలు, యూత్ సంఘాలు వినతి**

పలాస జూన్ 26 (వార్త): పలాసమండలం బొడ్డపాడుకు చెందిన రేవటి భూములు 150ఎకరాలు గత ప్రభుత్వం రైతులు వద్ద కొనుగోలు చేసిన భూములు వ్యవహారం లో అవక తవకలు ఉన్నాయని ఆ భూములు కొనుగోలు లో మాజీ మంత్రి అప్పలరాజు పాత్ర ఉన్నందున సమగ్ర విచారణ జరిపంచి రైతులకు న్యాయం చేయాలని స్థానిక తెలుగు దేశం నేతలు తో పాటు యువజన సంఘము నేతలు ఎమ్మెల్యే గౌతు శిరీష కు బుధవారం వినతి పత్రము అందించారు. అలాగే బొడ్డపాడు రెవిన్యూ పరిధిలోని 66,67సర్వే నెంబర్లు లోని 22ఎకరాల్లో భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం ఇప్పించాలని అంతే కాకుండా 22ఎకరాల్లో మిగిలిన భూములకు సంబంధించి వైసిపి కార్యకర్తలకు ఇళ్ల పట్టాల అక్రమంగా ఇచ్చారని ఆపట్టాలను రద్దు చేసి నష్ట పోయిన బాధితులకు న్యాయం చేయాలని కోరారు. అలాగే బొడ్డ పాడు నుంచి జాతీయ రహదారి వరకు ఉన్న 2.5కిలోమీటర్లు రోడ్డును పక్కా రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసి రైతులకు తగిన న్యాయం చేయాలని కోరారు. ఎమ్మెల్యేను కోరిన వారిలో కిక్కర ఢిల్లీ రావు, బొడ్డు దుష్యంతు,మామిడి కమలమ్మ, యువజన సంఘము నేత తామాడ క్రాంతి తదితరులు ఉన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





# వీక్షకులను ఆకర్షించిన ఫ్లాష్ మాబ్ డాన్స్

## మాదకద్రవ్యాలు వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించిన పట్టణ యువకులు

## అభినందించిన జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక



శ్రీకాకుళం, జూన్ 26 (వార్త): మత్తు పదార్థాలు సేవించడం వలన కలిగే దుష్ప్రభావాలు అనర్థాలు గురించి శ్రీకాకుళం పట్టణంలో జోష్ శివ అండ్ టీం సభ్యులు వినూత్నంగా ఫ్లాష్ మాబ్ డాన్స్ ద్వారా ప్రదర్శించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని మాదక ద్రవ్యాలు వినియోగం కలిగే అనర్థాలపై బుధవారం సాయంత్రం స్థానిక ఏడు రోడ్ల కూడలి వద్ద ట్రాఫిక్ సిఐ ఎం.అవతారం పట్టణ యువకులచే ఫ్లాష్ మాబ్ డాన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ జి.ఆర్ రాధిక హాజరై ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ అంతర్జాతీయ మాదక ద్రవ్యాలు దినోత్సవం సందర్భంగా ఈరోజు జిల్లాలో అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని అందులో భాగంగా శ్రీకాకుళం పట్టణంలో స్థానిక యువతతో ఫ్లాష్ మాబ్ డాన్స్ ద్వారా మాదక ద్రవ్యాలు వినియోగం వలన కలిగే దుష్ప్రభావాలు గురించి డ్యాన్స్ రూపంలో ప్రదర్శన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. యువత ప్రతి ఒక్కరు మాదకద్రవ్యాలు వల్ల కలిగే అనర్థాల పై అవగాహన కలిగి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కోరారు. అనంతరం జోస్ శివ టీం అండ్ సభ్యులకు జిల్లా ఎస్పీ గారి చేతుల మీదుగా జ్ఞాపికలు ప్రధానం చేసి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ అవతారం, రెడ్ క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, ప్రముఖ వ్యక్తులు యువత పాల్గొన్నారు.









### గ్రీవెన్స్ ఫిర్యాదుల పట్ల

# తక్షణం స్పందించాలి

### సరుబుజ్జిలి స్టేషన్‌ను ఎస్పీ జి.ఆర్.రాధిక సందర్శన



శ్రీకాకుళం టౌన్/ సరుబుజ్జిలి జూన్ 26 (వార్త): వార్షిక తనిఖీలలో భాగంగా జిల్లా ఎస్పీ జిఆర్ రాధిక బుధవారం సరుబుజ్జిలి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ క్రమంలో పలు కేసు ఫైల్, పోలీస్ స్టేషన్ నిర్వహణ రిజిస్టర్లును క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రజలతో మర్యాద పూర్వకంగా వ్యవహరించి పబ్లిక్ గ్రీవెన్స్ లో వచ్చే ప్రతి ఫిర్యాది పట్ల తక్షణమే స్పందించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం చేకూర్చాలని,పెండింగ్ కేసులు దర్యాప్తును వేగవంతం చేసి, ఛార్జ్ షీట్ దాఖలు చేయాలని పలు అంశాలపై దిశ నిర్దేశాలు చేశారు. జిల్లా ఎస్పీ వెంట శ్రీకాకుళం టౌన్ డిఎస్పీ వై శృతి, ఆముదాలవలస సర్కిల్ ఇన్స్పెక్టర్ దివాకర్, స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ ఉన్నారు.

Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413